నిధుల మంజూరుకు వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సుజాతనాయక్

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబును సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని వర్షపునీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తూ తక్షణమే నిధులు కేటాయించాలని వినతిలో కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

శారీరక వికలాంగుల రోస్టర్ మార్చాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఉదయ్ టీం సభ్యులు

చాదర్‌ఘాట్: శారీరక వికలాంగుల రోస్టర్ మార్చాలని ఉదయ్ టీం సభ్యులు సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ముఖ్యమంత్రి ప్రజావాణి చైర్మన్ చిన్నారెడ్డి, నోడల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేసి జీఓ పొడిగించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రిని కూడా నేరుగా కలుస్తామని వికలాంగులు అందరికీ ఉద్యోగం, ఉపాధి తప్పనిసరిగా అందాలన్నారు.

రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, ప్రజలకు ఆటంకం కలుగకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వైదేహినగర్ నుంచి డీపీఎస్ పాఠశాల వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్డుపై నీరు నిల్వకుండా లెవల్స్ చూసుకుని నిర్మాణం చేయాలని సూచించారు. ఆయన వెంట శ్రీధర్‌రావు, శంకరన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, కాంతారావు పాల్గొన్నారు.

జూట్ బ్యాగుల పంపిణీ



దిల్‌సుఖ్‌నగర్: ఇంటర్నేషనల్ వాసవీ మహిళా సమాఖ్య (ఐవీఎంఎస్) వ్యవస్థాపకురాలు ఉప్పల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌కేపురంలో ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా శక్తి జాతీయ శక్తి పేరిట పేదలకు చీరలు, జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, రమేష్, కల్పన, సరిత, జ్యోతి, సంతోషిని, స్వాతి, పావని సృజన, సుమనశ్రీ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఫొటో ఎక్స్‌పో–25 పోస్టర్‌ను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఫొటోలు కేవలం చిత్రాలు కావని ఒక కాలానికి చెందిన ఘటనలు, వ్యక్తుల భావోద్వేగాలను కలకాలం గుర్తుండేలా చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్, శ్రీనివాసులు, అలీసాయబ్, సోనుకుమార్, అంజన్‌కుమార్, బద్రీనాథ్, ప్రదీప్, నబి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

విమోచనం కల్పించిన ఘనత పటేల్‌దే


బండ వెంకట్‌రెడ్డి

చంచల్‌గూడ: తెలంగాణ ప్రజానికానికి విమోచనం కలిగించిన ఘనత మాజీ ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు మాత్రమే దక్కుతుందని యాకుత్‌పురా బీజేపీ కన్వీనర్ బండా వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా విమోచన దినం నిర్వహించడంలో విఫలమయ్యారన్నారు. ఎంఐఎం పార్టీకి భయపడిన సీఎం రజాకార్లు, మత ఛాందసవాదులపై పోరాడిన వారిని విస్మరిస్తున్నారన్నారు.

శాంతిభద్రతల రక్షణే ధ్యేయం

మలక్‌పేట ఏసీపీ సుబ్బరామిరెడ్డి

- పాత నేరస్తులపై నిరంతరం నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే..



చాదర్‌ఘాట్: విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలతో మమేకం అవుతున్నామని తద్వారా శాంతి భద్రతలను పరిరక్షిస్తామని మలక్‌పేట ఏసీపీ సుబ్బరామిరెడ్డి తెలిపారు. నిర్జన ప్రదేశాలు, వ్యాపార, వాణిజ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతామని అన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘాతో పాటు వివిధ అంశాలపై ఆయన సాక్షితో వివరించారు.

అత్యవసర సమయాల్లో పోలీసు సహాయం పొందాలంటే ఎలా?

ప్రజలు ఎప్పుడైనా డయల్ 100కు ఫోన్ చేయవచ్చు. ఫోన్ చేసిన 5 – 10 నిమిషాల్లో మా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు బాసటగా నిలుస్తారు.

ఇటీవల సైబర్ క్రైమ్‌లు పెరిగిపోయాయి బాధితులు ఎవరికి ఫిర్యాదు చేయాలి?

సైబర్ నేరాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా ఇతర వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నప్పటికి సైబర్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ కేసులన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో స్వీకరిస్తున్నాం.

గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

మాదక ద్రవ్యాలను సరఫరా, కొనుగోలు చేసిన నేరంగా పరిగణిస్తాం. కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటికి పలు విద్యాసంస్థలలో గంజాయి డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వినియోగం, తలెత్తే పరిణామాలపై అవగాహన కల్పించాం. ఖాళీ ప్రదేశాలు, లాడ్జీలు, పార్కులు, పాన్‌షాపుల్లో వారానికి రెండు సార్లు తనిఖీలు చేపడుతున్నాం.

శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలు ఏంటి?

విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. జనంతో మమేకం కావడంతో నేర ప్రవృత్తి పరిస్థితులను ముందుగానే పసిగడుతున్నాం. అంతే కాకుండా అన్ని పీఎస్ పరిధిలో పెట్రోలింగ్ పటిష్టం చేశాం. పాత నేరస్తుల కదలికలపై నిరంతరము నిఘా ఉంచుతున్నాము. తద్వారా వారు తమ ప్రవృత్తిని వీడి ఉపాధి మార్గాల వైపు దృష్టి సారిస్తున్నారు.

ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన నుంచి జరిగిన మార్పులు ఏంటి?

హైదరాబాద్ సీపీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తున్నాం. హత్యల ఊసే లేకుండా పోయింది. దొంగతనాలు చాలా వరకు తగ్గాయి. అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించగలిగాం.


వేణుగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేణుగోపాల్‌రెడ్డి సేవలు భేష్

నాగోలు: విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన అందించడంలో కొత్తపేట ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి సేలు భేష్ అని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఉప్పల్ మండల శాఖ అధ్యక్షులు ఆంజనేయులు అన్నారు. వేణుగోపాల్‌రెడ్డి ఇందినగర్ ప్రభుత్వ పాఠశాల నుంచి ఎస్‌జీటీగా ప్రమోషన్‌పై వెళ్లడంతో మంగళవారం పాఠశాలలో వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. వేణుగోపాల్‌రెడ్డి గత ఏడున్నర సంవత్సరాలుగా ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి 20 మంది ఉన్న విద్యార్థులను 60 మందికి చేర్పించి వారికి మంచి బోధన అందించారన్నారు. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను బోధిస్తూ వారిని అన్ని విధాల ప్రోత్సహించాడన్నారు. పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఎడిటర్ పిచ్చిరెడ్డి, కొత్తపేట హైస్కూల్ హెచ్‌ఎం నరసింహులు, నాగోలు కాంప్లెక్స్ ఇన్‌చార్జి అధ్యక్షులు కార్యదర్శులు సుధాకర్, కట్ట ఆంజనేయాలు, ఉపాధ్యాయులు కరుణాకర్, జ్యోతి, అనంతరెడ్డి, హనుమంత్‌రెడ్డి, నరేందర్‌పాల్, నర్సిరెడ్డి, గణేష్, సునీత, సంధ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

మంత్రులకు వినతులు


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యెచ్చు సునీల్

నాగోలు: కార్పొరేట్ సంస్థల్లో విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని విద్యార్థుల రాజకీయ పార్టీ (వీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షులు యెచ్చు సునీల్ కోరారు. మంగళవారం ఆయన పలువురు మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ సంస్థలల్లో విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఉచిత, మెరుగైన విద్య, నాణ్యమైన వైద్యం అందే వరకు విద్యార్థుల రాజకీయ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, నరేష్, మాధవ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని హయత్‌నగర్‌లోని వినాయకనగర్ కమ్యూనిటీహాల్లో నిర్వహిస్తున్నట్లు విశ్వకర్మ స్వర్ణకార సంఘం, హయత్‌నగర్ గౌరవ అధ్యక్షుడు రాగఫణి సతీష్‌కుమార్ చారి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సంఘం కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని 11 గంటలకు విశ్వభగవానుని యజ్ఞం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌చారి, ప్రవీణ్‌చారి, సంతోష్ చారి, యాదగిరిచారి, బ్రహ్మచారి, వెంకటేశ్వర్లు, సంతోష్‌చారి, కేశవచారి పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని హస్తినాపురంలో ఏర్పాటు చేయాలి


రంజిత్ కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం ఇస్తున్న మల్లేశ్‌గౌడ్

హస్తినాపురం: కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం హస్తినాపురం డివిజన్‌కు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను 2020లో మంజూరు చేసింది. ఈ సెంటర్‌ను డివిజన్ పరిధిలో కాకుండా మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాఘవేంద్రకాలనీలో ఏర్పాటు చేశారని వెంటనే ఆ సెంటర్‌ను హస్తినాపురం డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపి అధ్యక్షుడు ఎరుకల మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ రంజిత్ కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్ స్వార్థపూరిత నిర్ణయాలతో తమ బంధువుల ఇంటిలో చిన్న గదిలో సెంటర్‌ను ఏర్పాటు చేశారని ఆరోపించారు. గత ఐదు సంవత్సరాలుగా హస్తినాపురం ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలకు నోచుకోలేకపోతున్నారని విమర్శించారు. రాఘవేంద్రకాలనీలో కొనసాగుతున్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను హస్తినాపురంకు మార్చాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, విజయశ్రీ, బొమ్మిడి కిరన్‌రెడ్డి, డివిజన్ నాయకులు గొని వెంకటేశ్‌గౌడ్, పాశం జీవన్‌రెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్, శ్రీకాంత్‌గౌడ్, సాయి కృష్ణారెడ్డి, మల్లేశ్‌యాదవ్, బాలరాజు, కాంతారెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

ఆ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసులు, రామకృష్ణ

హస్తినాపురం: ఇంటర్మీడియేట్ సెలబస్‌ను పక్కన పెట్టి విద్యార్థులను జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, ఎంసెట్, నీట్ కోచింగ్ వైపు మళ్లించడంతో మార్కులు కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులను లూటీ చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలను వెంటనే రద్దు చేయాలని ఇంటర్మీడియేట్ విద్యామండలి అధికారులకు మంగళవారం ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నోజు శ్రీనివాసులు మాట్లాడుతూ.. భాషా పాఠాలు సరైన విధంగా బోధించడం లేదని 95 శాతం మంది విద్యార్థులు వ్యాకరణం, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోలేకపోతున్నారన్నారు. కొంత మంది విద్యార్థులపైనే దృష్టి పెడుతున్నారని మిగిలిన వారిని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మలక్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ అన్నారు. పెండింగ్ మెస్ చార్జీలు, ప్రైవేట్ భవనాల్లో ఉన్న హస్టళ్ల అద్దె, వర్కర్ల జీతాలు, స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని మంగళవారం మూసారంబాగ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించడమేనని అన్నారు. పేద, మధ్య, తరగతి విద్యార్థులు చదువులకు దూరం అయ్యే పరిస్థితులు దాపురించాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల సతీష్ మహాజన్, ఉదయ్‌కుమార్, ఉదయ్, సాయి, ఉదయ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సేవాపక్షం కార్యక్రమాలు


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎంఐఎంకు తొత్తుగా మారి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అణచివేస్తున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. మన్సూరాబాద్ పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ కార్యకర్తల తో కలిసి విమోచన దినోత్సవ స్టిక్కర్లను ఇంటింటికి అతికించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాటాలతో నాటి రజాకర్ల పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవాపక్షం కార్యశాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల్లో చైతన్యం కల్గిస్తూ, సమాజంలో మార్పునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగాచారి, నాంపల్లి రామేశ్వర్, మొరిశెట్టి సంతోష్, దామోదర్‌గౌడ, నాగిరెడ్డి, జయతేజ, గోపియాదవ్, రాము పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నాగోలు: సేవాపక్షం కార్యక్రమాల్లో భాగంగా బుధవారం జరిగే తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదినం, పరేడ్ గ్రౌండ్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సభకు తరలి వెళ్లాలని, అక్టోబర్ 2 గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ కో కన్వీనర్ నూకల పద్మారెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం నాగోలులో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బుధవారం ఉదయం నాగోలు చౌరస్తాలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్, పండ్ల పంపిణీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సంజీవరెడ్డి, పద్మారెడ్డి. గీతారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

22 నుంచి దేవీ శరన్నవరాత్రులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మునిపల్లె శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు దేవీ శరన్నవరాత్రులు జరుగుతాయని ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. నవరాత్రులకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం 6.30 కు అమ్మవారికి విశేష 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, 10.30లకు కుంకుమార్చన, సాయంత్రం 6 గంటలకి అమ్మవారు ప్రతిరోజూ విశేష అలంకరణలో దర్శనమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విఠల్ శర్మ, మునిపల్లె సువర్ణలత, సాయిశర్మ, అరుణ, హేమ, వాణిశ్రీ, విశ్వనాథ్, గీతాంజలి, కరుణాకర్ పాల్గొన్నారు.

నియామకం



వేణుగోపాల్ చారి, కుల్‌దీప్ జైన్

చైతన్యపురి: బీజేపీ చైతన్యపురి డివిజన్ ప్రధాన కార్యదర్శులుగా కొండోజు వేణుగోపాల్ చారి, కుల్‌దీప్ జైన్ నియమితులయ్యారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు గంగబోయిన నవీన్‌యాదవ్ ఉత్తర్వులు జారీచేసి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపి సిద్ధాంతాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేసి డివిజన్‌లో పార్టీ అభివృద్ధికి పాటుపడుతామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా పోరాడుతామన్నారు.

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతు బజార్‌కు ప్రతి నెల మూడవ బుధవారం సెలవు ఉంటుందని ఈఓ స్రవంతి తెలిపారు. నేడు రైతు బజార్‌లో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని గురువారం యథావిధిగా రైతుబజారు కొనసాగుతుందన్నారు.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

సైదాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) కోర్ కమిటీ వైస్ చైర్మన్, హైదరాబాద్ ఇన్‌చార్జ్ అందె రాంబాబు డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయాలని మంగళవారం చంపాపేట రహదారిపై ఉన్న సైదాబాద్ మండల కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా అందె రాంబాబు మాట్లాడుతూ.. ఏఐసీసీ ఎన్నికల హామీ మేరకు వికలాంగులకు వెంటనే రాజకీయ రిజర్వేషన్‌ను చట్టసవరణ, ఆర్డినెన్స్ ద్వారా అమలు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, ఆర్టీసీలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. వికలాంగుల వివాహ ప్రోత్సాహకాన్ని రూ. 5లక్షలకు పెంచాలని కోరారు. ధర్నాలో అంజిగౌడ్, షేక్ మస్తాన్‌వలీ, నాగరాజు, యాదమ్మ, రమాదేవి, మహేష్ పాల్గొన్నారు.

చైల్డ్ ఫ్రెండ్లీ న్యాయసేవల పథకం కీలక ముందడుగు


నందిగామ నరేందర్

చైతన్యపురి: బాలలకు సులభమైన, స్నేహపూర్వక న్యాయ సేవలను అందించేందుకు, బాలల హక్కులను పరిరక్షించేందుకు జాతీయ న్యాయసేవాధికార సంస్థ 2024 సెప్టెంబర్‌లో చైల్డ్ ఫ్రెండ్లీ న్యాయ సేవల పథకం (నాల్సా) ప్రారంభించటం జరిగిందని రంగారెడ్డి జిల్లా న్యాయవాది నందిగామ నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంరక్షణ అవసరమున్న పిల్లలు, చట్టంతో విరుద్ధంగా వ్యవహరించిన పిల్లలకు, ప్రత్యేక న్యాయ సహాయం అందించటం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో బాలల న్యాయసేవల విభాగాలు ఏర్పాటు చేశారని ఇవి జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తాయన్నారు. పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టం కింద కేసులు ఎదుర్కొంటున్న బాలలకు న్యాయ సహాయం, ఫిర్యాదు నమోదు, పరిహారం కోరుతూ దరఖాస్తు, రక్షణ ఉత్వర్వులు వంటి సేవలు అందించటం జరుగుతుందన్నారు.

ఆహారం కల్తీపై కఠినంగా వ్యవహరించాలి


సీపీకి వినతిపత్రం ఇస్తున్న రాజేశ్వర్‌యాదవ్

చంచల్‌గూడ: ఆహారం కల్తీపై కఠినంగా వ్యవహరించాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ మంగళవారం సీపీ సీవీ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆహారం కల్తిచేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం ప్రజలను మరింత భాగస్వాములను చేయాలన్నారు. అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. సీపీని కలిసిన వారిలో ఎం.కుమార్, రవిచారి, రఘునాథ్‌యాదవ్, ధనరాజ్‌గౌడ్ ఉన్నారు.

సందడిగా ఫ్రెషర్స్ డే



మలక్‌పేట: లక్ష్యాలను చేరుకోవడానికి కృషి, పట్టుదల అవసరమని దిల్‌సుఖ్‌నగర్ శ్రీ సాయి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ దిలీప్ రెడ్డి అన్నారు. సంగమం–2025 పేరుతో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసచారి, కామర్స్ హెచ్‌ఓడి శేఖర్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎల్‌వీటీ, అధ్యాపకులు అపర్ణ, మమత, గౌరీ, మేధా, షర్మిల, నజీరా పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక పురోగతికి సహకరించాలి

సైదాబాద్: మహిళల ఆర్థిక పురోగతికి అందరూ సహకరించాలని సేఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత కోరారు. ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో హ్యూమన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సహకారంతో సేఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఉడాన్ డే కేర్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి కాలనీ ప్రాంతంలో మహిళలు తమ విధులకు వెళ్లేందుకు ఇంట్లో ఉన్న చిన్నారులు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల నుంచి ఆరేళ్ల వరకు తమ పిల్లలను ఉంచి వెళ్లవచ్చని తెలిపారు. చిన్నారుల ఆలనా పాలన చూసుకునేందుకు సేఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గురు టీచర్లు, ఓ ఆయా ఉంటారన్నారు. జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ఆనంద్‌రావు, చంద్రహాస్, పావని, శ్రీను, వలీ, టీచర్లు సునీత, అంజలి, రెహనా, అపూర్వ పాల్గొన్నారు.